
అనంతపురం క్లాక్‌టవర్ వద్ద అభిమానుల సంబరాలు

ఆకాశమే హద్దుగా..!

జగజ్జేత.. భారత మహిళా క్రికెట్ జట్టు

- అనంతలో రెండో దీపావళి..!
- బాణసంచా పేలుస్తూ అభిమానుల సంబరాలు


క్లాక్‌టవర్ వద్ద సంబరాలు



క్లాక్‌టవర్ వద్ద బాణసంచా పేలుళ్లు, త్రివర్ణంతో ముస్లిం మహిళ ఆనందం

ఆకాశంలో సగం.. ఆటలోనూ సగం.. ఇన్నాళ్లూ క్రికెట్ అంటే టీం ఇండియా..! ఇకపై టీం ఉమన్ ఇండియా కూడా..! 120 కోట్ల భారతీయుల కలలను పండిస్తూ.. క్రికెట్‌లో అమ్మాయిలు అదరగొట్టేశారు. క్రికెట్ ప్రపంచం అబ్బురపోయే ఆటతీరుతో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. ప్రపంచ విజేతలుగా నిలిచి భారత క్రికెట్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించారు. ఇన్నాళ్లూ పురుషుల క్రికెట్ కోసం మాత్రమే టీవీలకు అతుక్కుపోయిన ఉమ్మడి జిల్లా క్రీడాభిమానులు ఈసారి మహిళల క్రికెట్ చూడటానికి కూడా అత్యంత ఆసక్తి చూపించారు. అనంతపురం నగరంలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి మరీ వీధుల్లో నిలబడి ఆటను ఆస్వాదించే ఏర్పాటుచేశారు. టీం ఉమన్ ఇండియా ఫైనల్‌లో విజయం సాధించగానే అభిమానులు సంబరాలు చేసుకున్నారు. అక్కడక్కడా తడబాట్లు.. కొన్ని పొరబాట్లు.. నరాలు తెగే ఉత్కంఠ రేపాయి. ఆఖరి వికెట్.. ఆకాశంలో ఎగురుతున్న బంతిని అందుకున్నట్లు కాకుండా.. ప్రపంచకప్‌ను అందుకున్నట్లు కనిపించింది..!


భవాని రవికుమార్ తదితరులు సంబరాలు


కేరింతలు కొడుతున్న యువకులు


స్క్రీన్‌పై మ్యాచ్‌ను తిలకిస్తూ..

మృత్యువులోనూ కలిసే..


చిన్నపాపమ్మ, వెంకటరమణ (ఫైల్)

50 ఏళ్ల వివాహ బంధం. అన్యోన్య దాంపత్యం. ఇద్దరి ప్రపంచం ఒక్కటే. ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టినా కలిసే ఉన్నారు. కష్టసుఖాలను పంచుకున్నారు. అంతటి పవిత్ర బంధాన్ని మృత్యువు కూడా విడదీయలేకపోయింది. రాత్రి భార్య చనిపోతే.. అర్ధరాత్రి తర్వాత భర్త కూడా ప్రాణాలు వదిలాడు. భార్య వెంటే వెళ్లిపోయాడు. అమడగూరు మండలం జౌకల కొత్తపల్లిలో వృద్ధ దంపతులు చిన్నపాపమ్మ(68), వెంకటరమణ (75) గంటల వ్యవధిలో అనారోగ్యంతో చనిపోయారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు. వారందరికీ వివాహాలు అయి, వేరు కాపురాలు ఉంటున్నారు. వృద్ధ దంపతులకు కుమారులు, కోడళ్లు ఆసరాగా ఉండేవారు. చిన్న పాపమ్మ రెండేళ్లుగా కిడ్నీ, గుండె జబ్బులతో బాధపడుతుండేది. వెంకటరమణ కూడా గుండె జబ్బు బారిన పడ్డాడు. ఈ నేపథ్యంలో చిన్న పాపమ్మ అనారోగ్య కారణాలతో శనివారం రాత్రి 7 గంటల సమయంలో చనిపోయింది. తీవ్ర మానసిక ఆవేదన చెందిన వెంకటరమణి ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు చనిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దంపతులకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. వారి మృతితో కుమారులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

-అమడగూరు(ఆంధ్రజ్యోతి)

నేడు పరిష్కార వేదిక



పుట్టపర్తి టౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సమస్యలపై అర్జీలు సమర్పించాలని సూచించారు.

గాలిలో ప్రాణాలు..!

- చిన్నారులకు బైక్‌లు
- పెరుగుతున్న ప్రమాదాలు
- మేల్కొనకపోతే తల్లిదండ్రులకు జైలుశిక్ష

- ఈ ఏడాది అక్టోబరు 19వ తేదీన నల్లమాడ మండలం గోపేపల్లి వద్ద ద్విచక్రవాహనం నడుపుతూ ఇద్దరు చిన్నారులు అదుపు తప్పి బండరాళ్లను ఢీకొట్టి మృతిచెందారు.
- అగళి మండలం బొమ్మసనపల్లికి చెందిన చిన్నారి బైక్‌పై వెళ్తూ లారీని ఢీకొట్టి మరణించాడు.


మోటారు సైకిల్‌పై విన్యాసాలు చేస్తున్న మైనర్లు

పుట్టపర్తిరూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చిన్నప్పుడే తమపిల్లలు బైక్‌లు నడుపుతున్నారంటూ కొందరు తల్లితండ్రులు సంబరపడిపోతుంటారు. మరికొందరు పిల్లలు.. తల్లిదండ్రులకు తెలియకుండా వాహనాలు తీసుకెళ్తుంటారు. తెలిసీతెలియని డ్రైవింగ్‌తో మోటారు సైకిళ్లపై విన్యాసాలు చేస్తూ ప్రమాదాలకు కారణమతున్నారు. కొన్నిసార్లు ఇతరుల ప్రాణాల పైకి తెస్తుంటారు. మైనర్లకు మోటారు వాహనాలు ఇవ్వడం ప్రమాదమనీ, తీవ్ర నేరమని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అయినా మైనర్లు బైక్‌లు నడుపుతూ.. ప్రమాదాల బారిన పడుతున్నారు. మైనర్లు ద్విచక్రవాహనాన్ని నడుపుతూ పట్టుబడితే గతంలో రూ.350 జరిమానా విధించేవారు. ఈ ఏడాది మే నెల నుంచి జరిమానా భారీగా పెంచారు. మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వాహన యజమానిపై అంటే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తారు. వాహన స్వాధీనం, లైసెన్సు రద్దు, జరిమానాలు తదితర కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

95 మంది మైనర్లకు జరిమానా

కళాశాలలు, విద్యాసంస్థల వద్ద ఎక్కువగా మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడుతున్నారు. జిల్లాలో గత పదినెలల్లో దాదాపు 95 మందికి జరిమానాలు విధించినట్లు పోలీసు గణాంకాలు చెబుతున్నాయి. మైనర్ల తల్లిదండ్రులను పోలీసుస్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

మ్యాచ్‌ను తిలకించిన మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళా క్రికెట్ వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌ను మంత్రి సవిత, నాయకులు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వీక్షించారు. భారత్, దక్షిణాఫ్రికా మ్యాచ్ కోసం ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



వరల్డ్‌కప్ మ్యాచ్‌ను తిలకిస్తున్న మంత్రి సవిత, నాయకులు



ఆలయం ముందు ట్రైనీ న్యాయాధికారులు

లేపాక్షిని సందర్శించిన ట్రైనీ న్యాయాధికారులు

లేపాక్షి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయాన్ని ఆదివారం దేశ వ్యాప్తంగా ట్రైనింగ్‌లో ఉన్న 40 మంది న్యాయాధికారులు సందర్శించారు. ఆలయంలో ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్థాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవిపాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించి సంతోషం వ్యక్తంచేశారు. ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయన్నారు. దుర్గావీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వృక్షాలకు విద్యుత్ దీపాల అలంకరణ


విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్న ప్రశాంతి నిలయం


ప్రశాంతి నిలయంలో విద్యుత్ కాంతులతో స్వాగత తోరణం

ఉత్సవ శోభ

సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలకు పుట్టపర్తి ముస్తాబవుతోంది. ప్రశాంతి నిలయం విద్యుత్ కాంతులతో విరాజిల్లుతోంది. ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా ప్రశాంతి నిలయం, విద్యాసంస్థలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, సత్యసాయి భవనాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో ప్రశాంతి నిలయంలో ఎటుచూసినా విద్యుత్ కాంతులతో విరాజిల్లుతోంది. స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ప్రశాంతి నిలయంలోని వృక్షాలకు సైతం విద్యుత్ దీపాలంకరణ చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా మిరుమిట్లు గొలుపుతోంది.

-పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి)

'అనంత' రైతుకు
నిరాశ

- కరువు మండలాల జాబితాలో దక్కని చోటు
- శ్రీసత్యసాయి జిల్లాలో 25 మండలాలు
- ఖరీఫ్‌లో భారీగా తగ్గిన వేరుశనగ దిగుబడి
- ఇతర పంటలదీ అదే తీరు
- పరిశీలించాలని రైతుల వేడుకోలు

7

మరో డీఎస్సీకి
సన్నద్ధం

- 17న జిల్లా విద్యాశాఖాధికారులతో కమిషనర్ సమీక్ష
- నిరుద్యోగుల్లో ఆశలు

ఐకమత్యంతో ముందుకెళదాం

కాపునాడు జాతీయ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం


మాట్లాడుతున్న కాపునాడు జాతీయ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

అనంతపురంరూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బలిజ కులస్థుల ఆశయాలను నెరవేర్చుకునేందుకు ఐకమత్యంతో ముందుకు సాగుదామని కాపునాడు జాతీయ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఆదివారం గుత్తి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో బలిజ, కాపునాడు సంఘం స్వర్ణోత్సవ రాయలసీమ ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. అంతకుముందు బళ్లారిరోడ్డులోని పవర్ ఆఫీసు నుంచి ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు నాగభూషణం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. రాష్ట్రంలో బలిజ కులస్థులు రాజ్యాధికారంలో వెనుకబడ్డారన్నారు. ఐక్యత కొరవడటమే ఇందుకు కారణమన్నారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి, వర్ధంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్టై రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాపు, బలిజలకు సరైన రాజకీయ ప్రాధ్యానం లేదన్నారు. ఈనెల 30న విజయవాడలో జరిగే కాపు నాడు స్వర్ణోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాయలసీమ కో-ఆర్డినేటర్ భాస్కర్ నాయుడు, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ రాష్ట్ర డైరెక్టర్ భవాని రవికుమార్, టౌన్ బ్యాంకు అధ్యక్షుడు జేఎల్ మురళీధర్, న్యాయవాది గాజుల ఆదెన్న, రవికాంత్ రమణ, పగడాల మల్లికార్జున, జనసేన రాష్ట్ర నేత కాయగూరల లక్ష్మీపతి, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, రాచానపల్లి పల్లి సింగిల్ విండో అధ్యక్షుడు పాముచాయి రఘు, నాయకులు పాముచాయి వెంకటేష్, రాయల్ మురళి పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

ఆలిండియా సెపక్‌తక్రా ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు

ఉరవకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆలిండియా సెపక్‌తక్రా ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 69వ ఏపీ స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 220 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అంతకుముందు క్రీడా పతాకాన్ని ఎగురవేసి, జ్యోతిని వెలిగించారు. అనంతరం ఏపీ స్కూల్ గేమ్స్ పరిశీలకుడు రమేష్ పోటీలను ప్రారంభించారు. జిల్లా జట్ల మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మారుతి ప్రసాద్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

కూలిన హెచ్చెల్సీ హెడ్ రెగ్యులేటర్


కూలిన హెడ్ రెగ్యులేటర్

బొమ్మనహాళ్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్ హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలోని 116/399 కి.మీ వద్ద ఉన్న అత్యవసర ద్వారం హెడ్ రెగ్యులేటర్ గేటు ఆదివారం రాత్రి కూలిపోయింది. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడంతో గేట్లకు తుప్పు పట్టి, చివరికి ఇనుప పలకలు విరిగిపోయి కూలిపోయాయిని స్థానికులు చెబుతున్నారు. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదు. నాలుగు గేట్లు ఉండగా మూడు గేట్లు విరిపోయాయి. సరిహద్దులో 1500 క్యూసెక్కులు నీరు వస్తున్నాయని జేఈఈ ఆల్తాఫ్ తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ తెగిపోవడం వల్ల ప్రస్తుతం నీరు ఎలాంటి వృథా కావని, సరఫరాకు ఎలాంటి ఆటంకం లేదు అని తెలిపారు. సోమవారం ఉదయం ఉన్నతాధికారులు పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్లు జేఈఈ తెలిపారు.

పింఛన్ కోసం వెళ్లిన వృద్ధురాలి మృతి

రొద్దం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రొద్దం గ్రామానికి చెందిన హనుమక్క(65) అనే వృద్ధురాలు పింఛన్ కోసం వెళ్లి మృత్యువాత పడింది. ఈనెల 1న రొద్దంలో ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా.. సుదూరంగా ఉన్న పశువుల ఆసుపత్రికి పింఛన్‌దారులను పిలిపించారు. అక్కడికి వెళ్లిన హనుమక్క తీవ్ర అస్వస్థతకు గురవడంతో 108లో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. అధికారులు ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేయడం లేదు. దీంతో వృద్ధురాలు పాత హరిజనవాడ నుంచి పింఛన్ కోసం ఊరిబయట ఉన్న పశువుల ఆసుపత్రి వద్ద నడుచుకుంటూ వెళ్లింది. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకేచోటికి పింఛన్‌దారులందరినీ పిలిపించి పంపిణీ చేయడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధురాలికి భర్త చనిపోగా పిల్లలు ఎవరూ లేకపోవడంతో బంధువులు దహన సంస్కారాలు చేశారు.

గంజాయి విక్రేత అరెస్ట్

తాడిపత్రి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో ఆదివారం గన్నెవారిపల్లి కాలనీకి చెందిన అబ్దుల్ గఫూర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 64 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. గఫూర్ గంజాయిని తెప్పించుకొని 4 గ్రాముల చొప్పున చిన్నచిన్న ప్యాకెట్లను తయారు చేసుకొని విక్రయించేవాడని అన్నారు. సమాచారం మేరకు అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్‌చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

30 మందిపై రౌడీషీట్

కదిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో హత్య, హత్యాయత్నం, గంజాయి విక్రయాలు, తరచూ నేరాలకు పాల్పడుతున్న 30 మందిపై రౌడీ షీట్ నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు 30 మందిపై రౌడీ షీట్ ఓపెన్ చేసినట్లు వివరించారు. వీరు ఎలాంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే పట్టణంలో తీవ్ర నేరాలకు పాల్పడిన ముగ్గురిపై పీడీ యాక్టు పెట్టి జైలుకు తరలించడానికి నివేదికలు పంపినట్లు తెలిపారు. గతంలో రౌడీషీటర్‌గా ఉండి సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌటీషీట్ తొలగించడానికి నిర్ణయించినట్లు వివరించారు.

నేడు డయల్ యువర్ సీఎండీ

అనంతపురంరూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ శేషాద్రి శేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీఎస్పీడీసీఎల్‌లో మొదటిసారిగా డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం ఈ కార్యక్రమాన్ని సీఎండీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతపురం జిల్లా వినియోగదారులు 9133331912 నెంబరును, సత్యసాయి జిల్లా వినియోగదారులు 8977716661 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపు టేబుల్ టెన్నిస్ జిల్లాస్థాయి పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడాకాల ఎంపిక పోటీలు ఈనెల 4వతేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంపీ పాండురంగయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక సప్తగిరిసర్కిల్‌లో ఉన్న అనంతపూర్ క్లబ్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్-15 బాల, బాలికలు, సీనియర్ మహిళలు, పురుషుల విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని వివరించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 17వతేదీ నుంచి విశాఖపట్నంలో నిర్వహించే ఏపీ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9848463245 నంబరులో సంప్రదించాలని సూచించారు.

'అనంత' రైతుకు నిరాశ

కరువు మండలాల జాబితాలో దక్కని చోటు
శ్రీసత్యసాయి జిల్లాలో 25 మండలాలు
ఖరీఫ్‌లో భారీగా తగ్గిన వేరుశనగ దిగుబడి
ఇతర పంటలదీ అదే తీరు
పరిశీలించాలని రైతుల వేడుకోలు


గుత్తి మండలం గొందిపల్లిలో తొలగించిన వేరుశనగ (ఫైల్)

అనంతపురం అర్బన్ నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో కరువు మండలాల జాబితా ప్రకటనలో అనంతకు తీరని నిరాశ మిగిలింది. రాష్ట్ర వ్యాప్తంగా మూడు జిల్లాల్లో 37 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించారు. ఇందులో శ్రీసత్యసాయిలో 25 మండలాలు, అన్నమయ్య 9, ప్రకాశంలో 3 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాల జాబితాలో చేర్చారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా కరువు మండలాల జాబితాను విడుదల చేసింది. ఇందులో అనంత జిల్లాకు స్థానం లేకపోవడంపై బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. కరువు మండలాల జాబితాలో ఉంటేనే ఆయా మండలాల్లోని రైతులకు పంటనష్టపరిహారం ఇస్తారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలకు కావాల్సిన కీలక సమయాల్లో వర్షం పడలేదు. దీంతో వేరుశనగ దిగుబడి భారీగా తగ్గిపోయింది. కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్న ఇతర రకాల పంటల పరిస్థితి దయనీయంగా మారింది. అనంత జిల్లాలోని ఒక్క మండలాన్ని కూడా కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడంపై ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కీలక సమయాల్లో కురవని వర్షం

ఈ ఏడాది ఖరీఫ్‌లో అరకొర వర్షాలకే వేరుశనగ పంటను సాగు చేశారు. పంట కీలక సమయం పూత దశ, ఊడలు దిగే దశ, పిందెలు ఊరే సమయాల్లో వర్షం రాకపోవడంతో వేరుశనగ పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. పలు ప్రాంతాల్లో వేరుశనగ పంట పైకి పచ్చగా ఉన్నా.. దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. జూలై, సెప్టెంబరు మాసాల్లో పంటల కీలక సమయాల్లో వర్షం పడలేదు. ఈ పరిస్థితుల్లో వేరుశనగ దిగుబడి భారీగా తగ్గింది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బ్రహ్మసముద్రం తదితర ప్రాంతాల్లో వర్షాభావంతో వేరుశనగ పంట ఎండిపోయింది. దీంతో కోతకు ముందే పంటను దున్నేశారు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 61.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 47.9 మి.మీ నమోదయింది. ఇందులో జూన్ మొదటి వారంలో ఎక్కువ శాతం వర్షం కురిసింది. జూలై సాధారణ వర్షపాతం 64.3 మి.మీలు కాగా 34.7 మి.మీ నమోదయింది. జూన్ 11 నుంచి ఆగస్టు 5వతేదీ దాకా పంటలకు సరిపడా వర్షం కురవలేదు. ఆ సమయంలో ఎక్కువ మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది. ఆగస్టు 5వతేదీ తర్వాత వర్షాలు కురిశాయి. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 84.4 మి.మీలు కాగా.. 165.9 మి.మీ కురిసింది. సెప్టెంబరు సాధారణ వర్షపాతం 111.6 మి.మీలు కాగా.. 87.0 మి.మీ మాత్రమే నమోదయింది. జూన్, జూలై మాసాలతో పాటు సెప్టెంబరులో తక్కువ వర్షాలు పడ్డాయి. ఆగస్టు నెలలో పడిన వర్షాలతో నాలుగు నెలల ఖరీఫ్ సీజన్ సాధారణ వర్షపాతం 321.5 మి.మీలుకాగా.. 335.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే 4.3 మి.మీ వర్షపాతం అదనంగా పడినట్లు నమోదయింది. సీజన్ మొత్తం వర్షపాతం వివరాలు ఆధారంగా తీసుకోవడంతోనే.. అనంత జిల్లాలోని మండలాలకు కరువు జాబితాలో చోటు కల్పించలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

తగ్గిన వేరుశనగ దిగుబడి

గత ఏడాది తరహాలోనే ఈసారి పంట కీలక దశల్లో వానలు పడకపోవడంతో వేరుశనగ పంట దిగుబడి భారీగా తగ్గింది. పంట పలు కీలక దశల్లో వర్షం పడి ఉంటే పంట బాగా పండితే ఎకరాకు 10 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుంది. ఈసారి జిల్లాలోని సగానికిపైగా మండలాల్లో ఎకరాకు క్వింటా నుంచి రెండు క్వింటాళ్లలోపు దిగుబడి మాత్రమే వచ్చింది. మరికొన్ని ప్రాంతాల్లో మూడు క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చినట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో చెట్టుకు నాలుగు లేదా ఐదు కాయలే ఉన్నాయి. కాయలున్న చోట కూడా అవుటన్ లేకపోవడంతో దిగుబడి భారీగా తగ్గింది. వ్యవసాయ, ప్రణాళిక శాఖలు చేపట్టిన పంటకోత ప్రయోగాల్లోనూ దిగుబడి తగ్గినట్లు తేటతెల్లమైంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 2.21 లక్షల హెక్టార్లల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో వేరుశనగ 72 వేల హెక్టార్లల్లో సాగైంది. వేరుశనగ పంట సాగు కోసం ఎకరాకు రూ.30వేల నుంచి రూ.45వేలకు పైగాపెట్టుబడి పెట్టారు. వర్షాధారం కింద సాగు చేసిన కంది, పత్తి, ఆముదం, మొక్కజొన్న తదితర ప్రధాన పంటల పరిస్థితి అదే తీరులో ఉంది. ఖరీఫ్‌లో పంటల దిగుబడి తగ్గడంతో రైతులు నష్టపోయారు.

పునరాలోచించాలని రైతుల వేడుకోలు

ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటల కీలక సమయాల్లో సరైన వర్షం పడకపోవడంతో వేరుశనగ దిగుబడి భారీగా తగ్గింది. మిగతా పంటల పరిస్థితి అంతే. క్షేత్ర స్థాయిలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని.. అనంత జిల్లాలో పంట దిగుబడులు తగ్గిన మండలాలను కరువు మండలాల జాబితాలోకి చేర్చాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. జిల్లాలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, కరువు మండలాల జాబితాలో చేర్చేలా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

సరైన సమయంలో వర్షం పడలేదు



ఈ సారి ఖరీఫ్‌లో నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. వేరుశనగ విత్తే సమయంలో వర్షం పడింది. తర్వాత కీలకమైన ఊడలు దిగే సమయంలో, పిందెలు ఊరే సమయంలోనూ వర్షం పడలేదు. దీంతో ఈసారి ఎకరాకు మూడు బస్తాలు కూడా దిగుబడి రాలేదు. పంట సాగు కోసం రూ.2 లక్షలు దాకా ఖర్చు చేశా. వేరుశనగ అమ్ముదామనుకుంటే బయట ధరలు తక్కువగా ఉన్నాయి. పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు. ఈ ఏడాది కరువు మండలాల జాబితాలో ఒక్క మండలం కూడా లేదంటున్నారు. ఇలాగైతే మరింతగా నష్టపోతాం. పంటనష్టపరిహారం అందించి ప్రభుత్వమే ఆదుకోవాలి.

-చంద్రశేఖర్, రైతు, పెద్దమట్లగొంది, శింగనమల మండలం

దిగుబడి తగ్గడంతో నష్టపోయా



ఈసారి ఖరీఫ్‌లో నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. ఎకరాకు రూ.40వేలు పెట్టుబడి పెట్టా. ఈసారైన పంట బాగా పండుతుందని ఎంతో ఆశతో విత్తనం వేశాం. పంట సాగు చేసిన తర్వాత కీలక దశల్లో వర్షాలు పడలేదు. దీంతో ఎకరాకు నాలుగు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. వర్షాన్ని నమ్ముకొని పంటలు సాగు చేసి నష్టపోతున్నాం. పంట దిగుబడి సరిగా రాకపోయినా కరువు మండలాల జాబితాలో మండలాన్ని చేర్చకపోవడం ఏమిటో అర్థం కావడం లేదు. ప్రభుత్వం వాస్తవాలను దృష్టిలో ఉంచుకొని రైతులకు న్యాయం చేయాలి.

-సుంకన్న, రైతు, గోవిందవాడ, బొమ్మనహాల్ మండలం

అన్నింటినీ కరువు మండలాలుగా ప్రకటించాలి

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం టౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ, ఇతర పంటలు సకాలంలో వర్షాలు రాకపోవడం వల్ల పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడం వల్ల రైతులు, కూలీలకు నష్టం జరుగుతుందన్నారు. సకాలంలో వర్షాలు రాక విత్తనం వేయాలా వద్దా అని దిక్కుతోచని పరిస్థిల్లో రైతులు అరకొర పంటలు సాగు చేశారని తెలిపారు. జూలై ఆఖరు, ఆగస్టులో కురిసిన వర్షాలకు సాగుచేసిన పంటల దిగుబడులు పూర్తిగా తగ్గాయని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తొలగించిన వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలు తడిసిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు స్పందించి అన్ని మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్పించి, రైతులకు నష్టపరిహారం, బీమా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మరో డీఎస్సీకి సన్నద్ధం

17న జిల్లా విద్యాశాఖాధికారులతో కమిషనర్ సమీక్ష
నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు

అనంతపురం విద్య, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మరో డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. డీఎస్సీ-2025 నియామకాల ప్రక్రియ ఇటీవలే ముగిసింది. చాలా మంది అభ్యర్థులు పోటీ పడినా అవకాశాలు రాక నిరుత్సాహపడ్డారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. ఇచ్చిన మాట ప్రకారం ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో విద్యాశాఖ రాష్ట్ర యంత్రాంగం మంత్రి లోకేశ్ హామీ అమలుకు అడుగులు వేస్తోంది. విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఇదే విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారులకు స్పష్టతనిచ్చారు. రెండు రోజుల క్రితం జరిగిన వెబెక్స్ మీటింగ్‌లో డీఎస్సీకి సర్వం సిద్ధం చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో డీఎస్సీ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని.. మే లేదా జూన్‌లో టీచర్ల నియామకాల ప్రక్రియ ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది.

జిల్లాలో 758 ఖాళీలు

కొత్త టీచర్ల నియామకాలు జరిగినా ఇంకా వందల సంఖ్యలోనే జిల్లాలో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఏ పాఠశాలలో ఏఏ కేడర్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయో జిల్లా యంత్రాంగం లెక్కలు తీసింది. మొత్తం అన్ని కేడర్లు కలిపి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, నగర పాలక యాజమాన్యాల పరిధిలో 758 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు లెక్కలు తేల్చారు. ఇందులో వచ్చే డీఎస్సీకి ఎన్ని టీచర్ పోస్టులు చూపిస్తారోనని అభ్యర్థులు ఆందోళనగా చూస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉన్న ఖాళీ పోస్టులలో 70 శాతం సర్వీస్ టీచర్లకు పదోన్నతులు కోసం కేటాయించాల్సి ఉంటుంది. మిగిలిన 30 శాతం ఖాళీలను డీఎస్సీ ద్వారా కొత్త టీచర్లకు అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది.

17న కమిషనర్‌తో సమావేశం

విద్యాశాఖ కార్యక్రమాలతో కొత్త డీఎస్సీ పోస్టులు గురించి జిల్లా విద్యాశాఖ అధికారులతో సమీక్షించడానికి కమిషనర్ ప్రత్యేకంగా జిల్లాల వారీగా సమీక్షలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే జిల్లా విద్యాశాఖకు ఈనెల 17న రాజధానిలో సమావేశం నిర్వహిస్తున్నారు. డీఎస్సీ ఖాళీలపై పూర్తిస్థాయిలో స్పష్టత రావాలంటే కేడర్ వారీగా లెక్కలు తేలాల్సి ఉంటుంది. ఈ మేరకు డీఈఓ ప్రసాద్‌బాబు ఎంఈఓలు, హెచ్ఎంలతో డివిజన్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే వారికి పట్టిక పంపించి సమాచారం తీసుకు రావాలని ఆదేశించారు. ఆ వివరాలను రాష్ట్ర అధికారులకు ఇవ్వనున్నారు. అనంతరం జిల్లాకు ఎన్ని టీచర్ పోస్టులు కేటాయిస్తారో అంచనాకు వచ్చే అవకాశం ఉంటుందని విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి.

నిరుద్యోగుల్లో ఆశలు

మళ్లీ కొత్త డీఎస్సీ నోటిఫికేషన్‌కు అడుగులు పడుతుండడంతో నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మొన్న చేజారిన ఉద్యోగాన్ని ఈసారైనా సాధించాలనే తపన అభ్యర్థుల్లో మొదలయింది. అప్పుడే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కొందరు ఇతర జిల్లాల్లోని కోచింగ్ సెంటర్లకు వెళ్లగా.. మరికొందరు అనంత జిల్లాలో ఉన్న కోచింగ్ సెంటర్లలో చేరి చదువులు మొదలు పెట్టారు. దీంతో కోచింగ్ సెంటర్లలో సందడి నెలకొంది.

13న జాబ్‌మేళా

ధర్మవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని షిర్డీసాయిబాబా సేవాసమితి అధ్యక్షుడు వీరనారాయణ, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి రామలింగయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళా స్థానిక పుట్టపర్తి రహదారిలోగల షిర్డీసాయిబాబా ఆలయంలో ఈనెల 13న ఉంటుదని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు మహిళలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు అర్హత ఉంటుందని, హాస్టల్, భోజన, రవాణా ఖర్చులు కూడా కంపెనీ భరిస్తుందని తెలిపారు. వివరాలకు 897702409, 7075699199 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సీకే నాయుడు క్రికెట్ మ్యాచ్ ప్రారంభం

సెంచరీతో కదంతొక్కిన నియాన్ శ్యామ్


సెంచరీ కొట్టిన నియాన్ శ్యామ్ కంగయాన్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బీసీసీఐ సీకే నాయుడు నేషనల్ క్రికెట్ టోర్నీ ఆదివారం అనంతపురం క్రీడా మైదానంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఆంధ్రా అండర్-23, పుదుచ్చేరి అండర్-23 జట్ల మధ్య జరిగే మ్యాచ్‌ను రెఫరీ నియతి లోకూర్ ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పుదుచ్చేరి జట్టు ఓవర్లలో 4వికెట్లకు 268 పరుగులు చేసింది. కెప్టెన్ నియాన్ శ్యామ్ కంగయాన్ సెంచరీ(256 బంతుల్లో 21 బౌండరీలతో 131 పరుగుల)తో నాటౌట్‌గా నిలిచాడు. నితిన్‌ప్రణవ్ 26, ప్రధ్వీరాజన్ ఖన్నా 29 పరుగులు చేశారు. ఆంధ్రా బౌలర్లు కమిల్, ఆదిత్యరెడ్డి, హేమంత్‌రెడ్డి, సుమిత్ చెరో వికెట్ తీశారు.

ఆల్మట్టిపై ఇక చావో.. రేవో..

ఆనకట్టు ఎత్తు పెంపును ఉపసంహరించుకోవాల్సిందే
రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు డాక్టర్ కుంచం


మాట్లాడుతున్న కుంచం

అనంతపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆల్మట్టి ఆనకట్ట వ్యవహారంలో ఇక చావో.. రేవో తేల్చుకుంటామని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సమితి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఆల్మట్టి ఆనకట్టు ఎత్తు పెంపు ప్రతిపాదనలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక సీఎం సిద్దరామయ్య, కేంద్ర జలవనరులశాఖ మంత్రి, కర్ణాటక గవర్నర్, నీటిపారుదల శాఖ మంత్రులకు రాసిన బహిరంగలేఖలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రైతులు నీటి కొరతను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా ఆశీంకట్టుదారులు తమ పంటలకు నీరు అందించలేక తీవ్ర కష్టనష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచే ప్రతిపాదనలను విరమించుకోవాలని ఆయన కోరారు. అలా చేయనిపక్షంలో ప్రజలకోసం తాను ప్రాణత్యాగానికి కూడా వెనుకాడబోనని హెచ్చరించారు.

యాదవ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా రామకృష్ణ యాదవ్


నూతన కార్యవర్గంతో యాదవ సంఘం నాయకులు

అనంతపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నక్కా రామారావు యాదవ భవన్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రభాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గోపాల్ యాదవ్‌ను యాదవ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ సమక్షంలో ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ధనుంజయ్ యాదవ్, కార్యదర్శిగా పరంధామ యాదవ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకులు నరసింహులు యాదవ్, నారాయణస్వామి, జైపాల్ యాదవ్, సుధాకర్ యాదవ్, ఆనంద్ యాదవ్, శ్రీనివాసులు, రవి యాదవ్, రామచంద్ర యాదవ్, కృష్ణమూర్తి యాదవ్, గుత్తి పవన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాపంపేట భూవివాదంలో కొత్త మలుపు

రాచూరి వెంకట కిరణ్‌పై ఆర్డీఓ ఫిర్యాదు
వీఆర్వో సంతకాలు ఫోర్జరీ చేశాంటూ కంప్లైంట్
రూరల్‌లో కేసు నమోదు

అనంతపురం క్రైం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ పరిధి పాపంపేట భూవివాదం కొత్త మలుపు తిరిగింది. ఇన్నాళ్లూ పాపంపేట భూముల్లో తమ భూములున్నాయంటూ... చెబుతున్న రాచూరి వెంకటకిరణ్‌పై అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. రాచూరి వెంకట కిరణ్ పాపంపేట భూముల్లో పొజిషన్‌లో ఉన్నట్టుగా ప్రస్తుతం రుద్రంపేట రెండో సచివాయం వీఆర్వోగా పనిచేస్తున్న రఘుయాదవ్ సంతకం ఫోర్జరీ చేశాడంటూ పోలీసులకు ఆర్డీఓ కేశవనాయుడు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు కట్టారు. వెంకట కిరణ్ పాపంపేటలో పొజిషన్‌లో ఉన్నట్లు 2024 ఆగస్టు 13వ తేదీన ఆరు సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. ప్రస్తుతం రుద్రంపేటలో పనిచేస్తున్న వీఆర్వో గోళ్ల రఘుయాదవ్ 2019 నుంచీ 2024 వరకూ ఏ నారాయణపురం వీఆర్వోగా పనిచేశారు. అదే సమయంలో సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. ఈ సర్టిఫికెట్లు వీఆర్వో ప్రమేయం లేకుండా జారీ అయినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. వీఆర్వో సంతకాలు ఫోర్జరీ చేసినట్టుగా గుర్తించిన ఆర్డీఓ కార్యాలయం నుంచీ అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో రూరల్ పోలీసులు వెంకట కిరణ్‌పై కేసు నమోదు చేశారు. అనేక రాజకీయ మలుపులు తిరిగిన ఈ భూవివాదంలో రాచూరిపై కేసు నమోదు కావడం చర్చకు దారితీసింది.

న్యూస్ బాక్స్

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు


పూజలు అందుకున్న పెద్దమ్మ దేవత

ముదిగుబ్బ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాతవూరిలో వెలసిన గ్రామదేవత పెద్దమ్మకు కార్తీక మాసం ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున పూజారులు పెద్దన్న, శివసాయి అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, వేపమండలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. మహిళలు అమ్మ వారికి గాజులు, చీరలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బాబా సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు


బాబా సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

ఓబుళదేవరచెరువు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓడీసీ బాబా పదో ఆరాధనోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి బాబా సన్నిధిలో ఖవ్వాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాబా భక్తులు వందలాదిమందికి అన్నదానం చేశారు. భక్తులు బాబా సమాధిని దర్శించుకున్నారు.

యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా
నరసింహ యాదవ్


నియామక పత్రం అందుకుంటున్న నరసింహయాదవ్

ముదిగుబ్బ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దన్నగారిపల్లికి చెందిన చినగాని నరసింహ యాదవ్‌ను ఆంధ్రప్రదేశ్ అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈ మేరకు తనను నియమిస్తూ అనంతపురంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంగళరావు యాదవ్, జాతీయ కార్యదర్శి పూజారి రాజశేఖర్ యాదవ్ తనకు నియామకపత్రం అందజేసినట్లు ఆయన విలేకరులకు తెలిపారు. గత 30 సంవత్సరాల నుంచి అఖిల భారతీయ యాదవ మహాసభకు సహాయ సహకారాలు అందంచడంతో పాటు, యాదవ హక్కుల కోసం, యాదవ కుటుంబాల అభివృద్ధి కోసం పని చేశారని, జిల్లా స్థాయిలోని, రాష్ట్ర స్థాయిలోని అనేక సమస్యపై యాదవ సంఘం అభివృద్ధికి పాటు పడడంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తనను ఎంపిక చేసిన అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షలు డాక్టర్ వెంగళరావు యాదవ్, జాతీయ కార్యదర్శి పూజారి రాజశేఖర్ యాదవ్, రాష్ట్ర ఉమ్మడి జిల్లా యాదవ సంఘం నాయకులకు చినగాని నరసింహ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

'పేదల కంటి చూపు కోసం కృషి'

ధర్మవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పేదలకు కంటి చూపును ప్రసాదించడమే లక్ష్యమని యువర్స్ ఫౌండేషన్ పట్టణ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం పేర్కొన్నారు. యువర్స్ ఫౌండేషన్, బెంగళూరుకు చెందిన నేత్రజ్యోతి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. 79 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఇందులో 43 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపు దాత గంజికుంట శ్రీధర్‌బాబు, కంటి వైద్యనిపుణులు అక్షిత, యువర్స్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి పలువురి చేరిక

అమడగూరు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జౌకలకొత్తపల్లికి చెందిన నారాయణస్వామి, వినోద్‌కుమార్‌తో పాటు మరికొంతమంది ఆదివారం బీజేపీలో చేరారు. పార్టీ సీనియర్ నాయకులు శరత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసుల ఆధ్వర్యంలో వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగ పార్టీ చేరిన వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ పాలనలో ప్రజలకు మంచి చేకూరుతోందని, అందుకే బీజేపీలో చేరామన్నారు. వారితోపాటు జయచంద్రారెడ్డి, శ్రీనివాసులు, హరినాయక్, వేమనారాయణ, హరీష్, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి
వృద్ధురాలికి తీవ్రగాయాలు

గాండ్లపెంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రెక్కమాను వద్ద ఆదివారం కదులుతున్న బస్సును ఎక్కుతూ జారి పడిన ఓ వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. మండ లంలోని పాయకట్టు గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనే వృద్ధురాలు కదిరికి వెళ్లేందుకు రెక్కమాను వద్ద వేచి ఉంది. తిమ్మమ్మమర్రిమాను నుంచి కదిరికి వెళ్తున్న కదులుతున్న ఆర్టీసీ బస్సును రెక్కమాను వద్ద ఎక్కడానికి ప్రయత్నించగా కాలుజారీ కిందపడింది. అయితే బస్సు ముందుచక్రాలు ఆమె కాళ్లపై వెళ్లడంతో రెండుకాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. తీవ్రంగా గాయపడిని ఆమెను 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదుచేసినట్లు ఏఎస్ఐ వెంకటరాముడు తెలిపారు.

కనకదాస జయంతికి తరలిరండి

● కురుబ సంఘం నాయకులు


మాట్లాడుతున్న కురుబ సంఘం నాయకులు

ధర్మవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భక్త కనక దాస జయంతికి తరలిరావాలని కురుబ సంఘం కల్యాణ మండపం అధ్యక్షుడు మలగుండ్ల మల్లికార్జున, ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య పిలుపు నిచ్చారు. కురుబ సంఘం నాయకులు ఆదివారం స్థానిక యశోదమ్మ వకీలు కురుబ కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ నెల 8వ తేదీన పట్టణంలో నిర్వహించే భక్త కనక దాసు జయంతి వేడుకలకు కురబ కులస్థులు పెద్దఎత్తున తరలిరావాలని కోరురు. కల్యాణ మండపం నుంచి ఉదయం 8గంటలకు బైకు ర్యాలీ చేపట్టి స్థానిక కళాజ్యోతి వద్ద ఉన్న భక్త కనక దాస విగ్రహం వద్ద వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు పూజారి నరసింహులు, కల్యాణమండపం సెక్రటరీ కప్పల బలరాం, కోటి వెంకటేశ్, గవ్వల నారాయణ స్వామి, గిరక నాగేంద్ర, బెల్లం తిరుపల్,గవ్వలబాబు, బులగుండ్ల రాజా, పోతుకుంట రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రావతి చెంతన రక్షణ కరువు

● నిండుగా ప్రవహిస్తుండడంతో పొంచి ఉన్న ప్రమాదం ● స్థానికుల ఆందోళన



హారతి స్నాన ఘట్టం, చెక్‌డ్యాం వద్ద కనిపించని రక్షణ గోడలు

పుట్టపర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సత్య సాయి జయంతి వేడుకల సందర్భంగా చిత్రావతి సుందరీకరణ ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా స్నాన ఘట్టం ఏర్పాటు చేశారు. అయితే కొన్ని రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో భక్తులు ఏ మాత్రం అప్రమత్తంగా లేకపోయినా ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదని పలువురు అంటున్నారు. జిల్లా కేంద్రం సమీపంలో చిత్రావతి నది నీటితో నిండుగా ఉంటూ పర్యాటకులను ఆకర్షిస్తోంది.ఇటీవల కురుస్తున్న వర్షాలకు నది పొంగిపొర్లింది. చెక్ డ్యాం సైతం నిండుగా నీటితో ఉండి పర్యాటకులను ఆకర్షిస్తోంది. మరోపక్క ఎనుముల పల్లి చెరువు నిండి మరువ వెళ్తోంది. అయితే ఇవి కాస్త పర్యాటకులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెండు వారాల్లో పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి వేడుకలు జరగనున్నాయి. భక్తులు లక్షల్లో పాల్గొనే అవకాశం ఉంది. సత్యసాయి నడియాడిన చిత్రావతి నది పరివాహక ప్రాంతాన్ని భక్తులు పరమ పవిత్రంగా భావిస్తారు. ఈ తరుణంలో వారు నదిలో పుణ్యస్నానాలు ఆచరించే అవకాశం ఉంది. భక్తుల కోసం నదికి ఒక ప్రాంతంలో హారతి స్నాన ఘట్టాన్ని ఏర్పాటు చేశారు. సుందరీకణ కోసం నది పరివాహక ప్రాంతంలో చెట్లను తొలగించి మట్టిని వేశారు. నదిలోతు తెలియని భక్తులు నదిలో దిగితే వారి ప్రాణాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. చిత్రావతి హారతి ఘాట్ వద్ద నదిలోకి మెట్లను ఏర్పాటు చేశారు. అయితే మెట్లు దిగి కిందికి వెళితే దాదాపు పది అడుగుల వరకు లోతు నీరుంది. తెలియని భక్తులు పొరబాటున మెట్ల మీద నుంచి నీళ్లలో జారిపడినా ప్రాణాపాయం జరిగే అవకాశం లేకపోలేదు. గతంలో హారతి ఘాట్ వద్ద నదిలోకి దిగి పలువురు ప్రమాదంలో పడిన సంఘటనలు ఉన్నాయి. అలాగే ఎనుములపల్లి చెరువు వద్ద రోడ్డు వెళుతుంది. ఆ రోడ్డు ఇరుకుగా ఉండడం వల్ల వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పితే చెరువులో పడే అవకాశం ఉంది. సుందరీకరణ పనులు అయితే చేశారు కానీ, చిత్రావతి నది పరివాహక ప్రాంతాల్లో ఎలాంటి రక్షణ ఏర్పాట్లు చేయక పోవడం విమర్శలకు తావిస్తోంది. భక్తులు అధిక సంఖ్యంలో వచ్చినప్పుడు పలువురు తెలియ నీటిలో పడే అవకాశం ఉందని, అలా జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఎనుములపల్లి చెరువు గట్టుపై ఇరుకుగా ఉన్న రోడ్డు

రక్షణ చర్యలు చేపట్టాలి



చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. సత్యసాయి జయంతి వేడుకల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు. తెలియక నదిలోకి దిగితే మునిగిపోయే అవకాశం ఉంది. తాత్కాలికంగా అయినా ఇనుపకంచెను వేస్తే బాగుంటుంది. -ఆదిరాజు, పుట్టపర్తి

రోడ్డు వెడల్పు చేయాలి



ఎనుములపల్లి చెరువు వద్ద ఉన్న రోడ్డు వెడెల్పుగా లేకపోవడంతో వాహనాలు అదుపు తప్పి చెరువులో పడే ప్రమాదం ఉంది. చెరువు పక్కన రోడ్డు వెడెల్పు చేస్తే మేలు. సత్యసాయి జయంతి వేడుకలకు ఎక్కువ మంది భక్తులు వస్తారు. ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉంది. దీంతో ముందస్తుగా చెరువు పక్కనున్న రోడ్డు వెడెల్పు చేస్తే ట్రాఫిక్ సమస్యలు ఉండవు. ప్రాణాపాయం తప్పే అవకాశం ఉంది. - చంద్రశేఖర్ రెడ్డి, ఎనుములపల్లి

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రణాళికలు

● అధికారులతో పరిటాల శ్రీరామ్


మున్సిపల్ అధికారులతో సమావేశమైన పరిటాల శ్రీరామ్

ధర్మవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాలు, కాలనీల్లో సమస్యలను పరిష్కరించేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అధికారులకు సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల నేపథ్యంలో పరిటాలశ్రీరామ్ ఆదివారం ధర్మవరంలోని తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌తోను, తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ, ధర్మవరం ఎంపీడీఓల తో వేర్వేరుగా సమావేశాన్ని నిర్వహించారు. మండలానికి ఎంత నిధులు రావచ్చు, వాటితో ఎలాంటి పనులు చేయబోతున్నారనే అంశాలపై చర్చించారు. ఇటీవల నియోజకవర్గ వ్యాప్తంగా 'మీ సమస్య- మా బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించినప్పుడు తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదుపై చర్చించారు. ఇందులో గ్రామాల్లో తాగునీరు, శ్మశాన వాటికలు, డ్రైనేజీ, రోడ్ల వంటివి ఉన్నాయన్నారు. ముందుగా వాటికి ప్రాధాన్యమిస్తూ ప్రణాళిక రూపొందించాలని, ప్రాధాన్యత వారీగా పనులు చేపట్టాలన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సమస్యలు తెలిపారని, వాటిపై దృష్టి సారించాలని కమిషనర్‌తో అన్నారు. ముందుగా గ్రామాలు, కాలనీలను ఒకసారి పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణ, డీఈ వీరేశ్, ఎంపీడీఓలు, టీడీపీ ముఖ్య నాయకులు కమతంకాటమయ్య, చింతలపల్లి మహేశ్‌చౌదరి, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, నాగూర్‌హుస్సేన్, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, రాళ్లపల్లి షరీఫ్, అంబటి సనత్, కొత్తపేట ఆది, జింకా పురుషోత్తం, అస్లాం, విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పేదలకు విద్య, వైద్యం చేరువచేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఇద్దరికి మంజూరైన రూ.89 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీచేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి, పరిటాలశ్రీరామ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మవరం నృత్య కళాకారుల ప్రతిభ


అవార్డులు అందుకున్న ధర్మవరం కళాకారులు

ధర్మవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా అహోబిలం పుణ్యక్షేత్రంలో శనివారం నిర్వహించిన జాతీయస్థాయి నవనారసింహ నృత్యోత్సవాలలో ధర్మవరానికి చెందిన లలిత నాట్యకళానికేతన్ గురువులు, శిష్యబృందం అవార్డులు అందుకు న్నారు. మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్ సహకారంతో సాయినృత్యాంజలి సంస్థ నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ ఉత్సవాలలో నాట్యగురువులు బాబు బాలాజీ, కమలబా లాజీ, రామలాలిత్య, 20మంది శిష్యబృందం పాల్గొని భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించి బాల ప్రహ్లాద అవార్డులు అందుకున్నారు. ఈ అవార్డులను జ్వాలా నరసింహస్వామి అవార్డు సంస్థ వ్యవస్థాపకులు పళ్లెం శెట్టి సురేశ్, అహోబిల ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల్‌స్వామి చేతులమీదుగా అందుకు న్నట్లు తెలిపారు. అవార్డులను అందుకున్న వారి లో గురువు లతో పాటు శిష్యులు అర్చన, లీలా, మహిత, ధాత్రిక, దేవాంశిత, యశస్విని, ఉదయశ్రీ, ప్రజ్ఞ, రోశిత, అచ్యుత, సాయి ఉన్నారు.

కంకర తేలిన రోడ్డు

● ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు


కంకర తేలిన తురకవానిపల్లి రోడ్డు

తనకల్లు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నరామన్నగారిపల్లి పంచాయతీ కేంద్రం నుంచి ఆ పంచాయతీలోని తురకవానిపల్లికి దాదాపు 30 యేళ్ల క్రితం నిర్మించిన రోడ్డు చాలా అధ్వానంగా మారింది. కంకర తేలిన రోడ్డు ప్రయాణించేందుకు ఆ గ్రామస్థులు చాలా అగచాట్లు పడాల్సి వస్తోంది. చిన్నరామన్నపల్లి నుంచి తురకవానిపల్లి వరకు 30 ఏళ్ల క్రితం మూడు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. అందులోనూ సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఆవులచెరువు (సీఆర్‌పల్లి చెరువు) మాత్రమే తారురోడ్డు వేసి, మిగిలిన రోడ్డును వదిలేశారు. ఆ తరువాత ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో తారు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. కంక రతేలి చాలా అధ్వానంగా మారింది. ఈ రోడ్డుగుండా తురకవానిపల్లికి ప్రయాణం చేయాలంటే ద్విచక్రవాహనదారులు, ఆటో డ్రైవర్లు నరకయాతన పడాల్సి వస్తోంది. ఇప్పటికే ఎంతోమంది ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. తమ గ్రామానికి ఉన్న రహదారిని బాగు చేయాలని ఎన్నిమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా, పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు వాపోతున్నారు. తమ గ్రామానికి రహదారి సరిగా లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. అదేవిధంగా చిన్నరామన్నగారిపల్లి పంచాయతీలోని చిన్నరామన్నగారిపల్లి, గోపిరెడ్డిపల్లి, గోపిరెడ్డిపల్లిదళితవాడ, తొట్లివారిపల్లిలకు వెళ్లాలంటే రోడ్లు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజలంటున్నారు. అలాగే ఈతోడు నుంచి వెళ్లాలన్నా, ఇటు నల్లచెరువు మండలం ఎర్రగుట్టపల్లి నుంచి వెళ్లాలన్నా రహదారులు గుంతలమయమై అవస్థలు తప్పడంలేదని తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిదులు స్పందించి ఈతోడునుంచి తురకవానిపల్లి వరకు, నల్లచెరువు మండలం ఎర్రగుట్టపల్లి నుంచి చిన్నరామన్నగారిపల్లి క్రాస్ రోడ్డు వరకు బాగుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నల్లమాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1992-93లో దోతరగతి చదివిన విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి మధురస్మృతులను గుర్తు చేసుకుని సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు సుబహాన్, అంజాద్ బాషా, దేవవరం, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి తదితరులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ... విద్యార్థులు తమను గుర్తుంచుకుని సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. తాము చదివిన పాఠశాలలో నూతన ఆడిటోరియం నిర్మాణానికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. భవిష్యత్‌లో పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

కదిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలో సోమ, మంగళవారాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీకి తాగునీరు అందిస్తున్న చిత్రావతి రిజర్వాయర్ సమీపంలోని దొరిగిల్లు వద్ద తాగునీటి సరఫరా పైప్‌లైన్‌లో అంతరాయం ఏర్పడిందని తెలిపారు. మరమ్మతుల నిమిత్తం రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా ఉండదన్నారు. మరమ్మతుల అనంతరం తాగునీటి సరఫరా యథావిధిగా ఉంటుందన్నారు. కావున పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

కేతిరెడ్డి కాలనీలో చోరీ


బీరువాలోని వస్తువులను చిందవందర చేసిన దుండగులు

ధర్మవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేతిరెడ్డికాలనీ ఎల్-3లోని నాగేంద్ర ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. పట్టణ సమీపంలోని కేతిరెడ్డికాలనీ ఎల్-3లో నివాస ముంటున్న నాగేంద్ర శనివారం రాత్రి ముత్యాలమ్మ పూజ ఉందని ధర్మవరం పట్టణంలోని తన అల్లుడు చంద్రశేఖర్ ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. గమనించిన గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళాలు పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాను పగలకొట్టి అందులో ఉన్న రెండు వెండిచైన్లు, నాలుగు గ్రాముల ఉంగరం, ఆరుపట్టు చీరలను అపహ రించుకుని వెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చిన నాగేంద్ర చోరీ జరిగినట్లు గమనించి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాగేంద్ర మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ కరేగౌడ్ తెలిపారు. సుప్రభాతసేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామికి, దొడ్డేశ్వరస్వామికి, మల్లేశ్వరస్వామికి, విరూపాక్షి స్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వచ్చిన భక్తులకు ప్రసాదం, అన్నదానం నిర్వహించారు.

ఘనంగా తులసిపూజ



హిందూపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పేట వెంకటరమణస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి కార్తీకమాసం ద్వాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. ధాత్రి, తులసిపూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆకాశ దీపం జరిగింది.

జ్యోతిర్లింగాలను దర్శించుకున్న మంత్రి



మంత్రిని సన్మానిస్తున్న బ్రహ్మకుమారీలు

సోమందేపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గీతానగర్‌లో ఈశ్వరీయ బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను ఆదివారం మంత్రి సవిత దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీ కార్యదర్శులు ప్రభావతి, హేమావతి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించండి: మంత్రి

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత సూచించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ప్రతాప్, వలంటీర్లు బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని తోటగేరి తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు జీఎస్‌టీ 2.0 తదితరవాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు చేపట్టిన సేవాకార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడం, ప్రాచీన కట్టడాలవద్ద క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టడం హర్షణీయమన్నారు.

జూడోలో కేజీబీవీ బాలికల ప్రతిభ



రాష్ట్రస్థాయికి ఎంపికైన కేజీబీవీ విద్యార్థినులు

హిందూపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో చాంపియన్‌షిప్‌నకు హిందూపురానికి చెందిన కేజీబీవీ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం మాధవి తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈనెల 6, 7న కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

ఘనంగా తులసాంబదేవి రథోత్సవం



రథోత్సవంలో కొలువుదీరిన తొలసాంబదేవి

లేపాక్షి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోపిందేవరపల్లి గ్రామంలో వెలసిన తులసాంబ దేవి రథోత్సవ వేడుకలను ఆదివారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి రథంలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామస్థులు అధిక సంఖ్యలో విచ్చేశారు. హిందూపురం టీడీపీ సీనియర్ నాయకులు గ్రీన్‌పార్క్ నాగరాజు, ఎమ్మెల్యే పీఏ వీరయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాముల బెడద

పరిగి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రశాంతినగర్ కాలనీలోని ఉర్దూ పాఠశాలలో పాముల బెడద తీవ్రంగా మారింది. పాఠశాల ఆవరణంలో పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉండటంతో పాములు అధికంగా ఉంటున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అధికారులు స్పందించి పాఠశాల పరిసరాలు శుభ్రం చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా పాఠశాల ఆవరణం

ఆదాయం ఘనం.. సౌకర్యాలు మృగ్యం

సోమందేపల్లి వారపు సంతలో అవస్థలు



సంతలో వెలసిన దుకాణాలు



నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ టాయ్‌లెట్స్ (ఫైల్)

సోమందేపల్లి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రతివారం మండల కేంద్రంలో జరిగే వారపుసంతలో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని వ్యాపారులు విమర్శిస్తున్నారు. జనాభాకు అనుగుణంగా సంతలో దుకాణాల సంఖ్య క్రమంగా పెరిగింది. మార్కెట్‌రోడ్డుతోపాటు గోరంట్ల రోడ్డు, పంచాయతీ కార్యాలయం రోడ్డులో ఎన్టీఆర్ సర్కిల్‌వరకు దుకాణాలు వెలిశాయి. సంతలో వ్యాపారాల కోసం పెనుకొండ, సోమందేపల్లి, సికెపల్లి, కదిరి, తలుపుల, గోరంట్ల తదితర మండలాల నుంచి పెద్దఎత్తున వ్యాపారస్థులు వస్తుంటారు. ప్రతివారం వేలం పాటను దక్కించుకున్న కాంట్రాక్టరు వ్యాపారుల నుంచి సుంకాలను ముక్కుపిండి వసూలు చేస్తున్నారనీ, సౌకర్యాలను కల్పించడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీకి ఏటా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా వ్యాపారస్థులకు కాలకృత్యాలు తీర్చుకోవడానికి, నీడ, నీరు, కనీస సౌకర్యాలు అధికారులు కల్పించలేకపోతున్నారు. సంతలో మహిళా వ్యాపారుల బాధలు వర్ణనాతీతం. తొమ్మిదేళ్ల క్రితం రూ.8లక్షలతో పబ్లిక్ టాయ్‌లెట్లు పంచాయతీవారు నిర్వహించారు. నిర్వహణ లేకపోవడంతో అవి వృథాగా మారి నిరుపయోగంగా ఉన్నాయి. గత యేడాది వ్యాపారులు ఆందోళనకు దిగిన నేపథ్యంలో మరమ్మతులు చేసి పబ్లిక్ టాయ్‌లెట్లు వినియోగంలోకి తెస్తామని పంచాయతీ కార్యదర్శులు హామీ ఇచ్చారు. లీజుకు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. అయితే ప్రస్తుతం పరిస్థితి మరింత దారుణంగా మారింది. పబ్లిక్ టాయ్‌లెట్స్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి దారి మూసుకుపోయింది. ముందుగా ఉన్న అంగళ్లవద్ద జనం గుంపులుగా ఉండటంతో మరుగుదొడ్లను వినియోగించుకోలేకపోతున్నామని మహిళ వ్యాపారులు అంటున్నారు. ప్రహరీగోడను నిర్మించాలని కోరుతున్నారు. దీనిపై కార్యదర్శి రామాంజినేయులును వివరణ కోరగా త్వరలో మరమ్మతులు చేపట్టి నిర్వహణలోకి తీసుకొస్తామన్నారు. ప్రహరీగోడకు పంచాయతీ ఆమోదం తీసుకుని ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.

గాంధీబజార్ దాటాలంటే గగనమే..!

వాహనాల రద్దీతో ప్రయాణం నరకప్రాయం



రద్దీ ఎక్కువై ఆగిన వాహనాలు

మడకశిరటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీబజార్ దాటాలంటే గగనమవుతోందని పట్టణవాసులు అంటున్నారు. పట్టణంలో పాత కర్నాటక బ్యాంకు, అంబేడ్కర్ సర్కిల్ వద్ద రోడ్డుకు అడ్డంగా మోరీల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలు హైవేపై నుంచి సాగాలని అధికారులు సూచించారు. వాహనదారులు పట్టించుకోవడంలేదు. పోలీసులు కూడా పూర్తిస్థాయిలో చేతులు ఎత్తేయడంతో గాంధీ బజార్ దాటాలంటే గగనంగా మారింది. సమస్యను గాంధీబజార్ వాసులు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా ఓ క్లీనిక్ వద్ద కార్లు, ఇతర పెద్ద వాహనాలు వెళ్లకుండా అడ్డంగా మట్టిని తోలారు. అయినా చిన్న మార్గం చేసుకొని అందులో నుంచే ప్రయాణాలు సాగిస్తుండటంతో ప్రతినిత్యం ప్రయాణం నరకతరంగా మారుతోంది. ఒక్కసారి గాంధీబజార్ దాటాలంటే అరగంట నుంచి గంట సమయం పడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో గంటల తరబడి సమయం పడుతోంది. ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తే పెద్దగా ఇబ్బందులు ఉండవని, పెద్ద ఆటోలు, కార్లు, ఇతర పెద్దవాహనాలు ప్రవేశిస్తే దాటడం కష్టతరంగా మారుతుందని, పోలీసులు వెంటనే జోక్యం చేసుకొని ఇబ్బందులు తొలగించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రధాన రహదారిపై డ్రైనేజీ నిర్మాణం పనులు జరుగుతున్నందున వాహనాలు గాంధీబజారు పై రాకపోకాలు సాగిస్తున్నాయి. గతంలో పోలీసులను పెట్టి ట్రాఫిక్ సమస్య లేకుండ పెద్ద వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకొన్నం. గాంధీబజార్‌లో సరుకులు తరలిస్తుంటామని ఇబ్బందులు వస్తుంటాయని పలువురు మా దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సడలించడం వల్ల సమస్యలు వచ్చాయి. తిరిగి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటాము.

-సుబ్రహ్మణ్యం, సీఐ

శ్మశానానికి దారి చూపుతాం

కొర్లకుంట ఎస్సీ కాలనీవాసులకు అధికారుల హామీ



దారి పరిష్కారంపై చర్చిస్తున్న అధికారులు

చిలమత్తూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్మశానానికి దారి చూపుతామని కొర్లకుంట ఎస్సీ కాలనీవాసులకు ఆదివారం అధికారులు హామీ ఇచ్చారు. మండలంలోని కొర్లకుంట ఎస్సీ కాలనీ వాసులు శ్మశాన వాటికకు దారిలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్మశాన వాటికకు వెళ్లేందుకు దారి లేదని, ఎన్నో రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే దారి చూపాలంటూ శనివారం అదే గ్రామానికి చెందిన గంగాచ్చమ్మ మృతదేహంతో నిరసన చేపట్టిన విషయం విదితమే. దీనిపై అధికారులు స్పందించారు. కాలనీవాసులతో చర్చించి మృతురాలు దహన కార్యక్రమాలు చేసుకోవాలని సూచించారు. అయితే సీపీఐ నాయకులు వినోద్‌కుమార్, శివప్ప, గోపాలకృష్ణ తదితరులు శాశ్వత పరిష్కారం చూపే వరకు దహన సంస్కారాలు చేయమంటూ ఆందోళన చేపట్టారు. దీంతో మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ వెంకటేశులు, సీఐ జనార్దన్, ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ తదితరులు కాలనీకి వెళ్లి దారి విషయంపై చర్చించారు. శ్మశాన వాటికకు వెళ్లేందుకు పది అడుగుల రోడ్డు కావాలని, అందుకు కొందరి రైతులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. అయినా వారు వినకపోవడంతో రైతులను పిలిపించి శ్మశాన వాటికకు వెళ్లే దారి కోసం భూమిని ఇవ్వాలని కోరారు. అందుకు సంబంధించి రైతులకు నోటీసులు అందజేసి వారి నుంచి దారి కోసం భూమిని తీసుకునే చర్యలు చేపడతామన్నారు. త్వరలో శ్మశాన వాటికకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో కాలనీ వాసులు శాంతించారు. అనంతరం గంగాచ్చమ్మ మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వేడుకల్లో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

పరిగి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనాపురం గ్రామంలో ఆదివారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులు మోసి స్వామికి సమర్పించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మహర్షి విగ్రహానికి పూలమాలలువేసి పూజల్లో పాల్గొన్నారు. మహర్షిరాసిన రామాయణం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో రాజగోపాల్, రాము, వాల్మీకి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థుల శ్రమదానం



పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

గోరంట్ల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌కాలనీలో ఎస్‌పీడీఎం డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఆదివారం శ్రమదానం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ఏడు రోజుల శిబిరంలో భాగంగా రెండవరోజు ప్రాథమిక పాఠశాల ఆవరణం, కాలనీలోని వీధులను విద్యార్థులు శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రత వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. వారితోపాటు ఎన్‌ఎస్‌ఎస్ పీఓ రఘునాథ్‌రెడ్డి, అధ్యాపకులు ఆజాద్, పాల మోహన్, హరీష్ విద్యార్థులు ఉన్నారు.

ఇల్లాలి చదువు.. సమాజానికి వెలుగు

హిందూపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళలు చదువుకుంటే కుటుంబంతోపాటు సమాజానికి వెలుగునిస్తారని ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు అన్నారు. ఆదివారం బాలయేసు కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు సంజీవరాయనపల్లిలో ఐదోరోజు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మైక్రోప్లానింగ్స్‌పై సర్వేచేపట్టారు.

వైభవంగా శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠాపన

గుడిబండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.గొల్లహట్టి గ్రామంలో ఆదివారం గ్రామస్థుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, ఒక్కళిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, మండల బీసీసెల్ అధ్యక్షులు జయరామప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి చిత్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆధార్ సేవలు అందక ఇబ్బందులు

లేపాక్షి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆధార్ సేవలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఆధార్‌లో పేర్లను సరిచేసుకోవడానికి ఆధార్ కేంద్రం ఉన్నా టెక్నికల్ సమస్యతో పనిచేయడం లేదు. దీంతో ఇతర మండలాలకు పరుగులు తీస్తున్నారు. మండల కేంద్రంలో ఆధార్ సేవలు ఏర్పాటు చేయకుండా అధికారులు చోళసముద్రం సచివాలయ కేంద్రంలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రానికి దూరంగా ఉండటంతో ప్రజలు రాకపోకలకు సౌకర్యంలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్ కేంద్రం సైతం 15రోజుల నుంచి పనిచేయడం లేదని ప్రతిరోజూ చాలామంది ఆధార్‌కేంద్రానికి వెళ్లి వెనుతిరుగుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అందుబాటులోకి తీసుకురాకపోగా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా లేపాక్షిలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటుచేసి ప్రజల సమస్యలు తీర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

సోమందేపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివానగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారులకు ఆదివారం న్యాయవాది భాస్కర్‌రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతియేటా మాదిరి అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం దీక్ష బూనిన స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.



మాలధారులకు భోజనం వడ్డిస్తున్న న్యాయవాది దంపతులు

ప్రపంచ కప్ గెలవాలంటూ పూజలు



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

హిందూపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ వన్ డే వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో భారత్ విజయం సాధించాలని టీడీపీ నాయకులు ఆదివారం పూజలు చేశారు. చౌడేశ్వరీ కాలనీలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి ప్రపంచకప్ కైవశం చేసుకోవాలని ప్రార్థించారు. టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్మన్ రమేష్, పట్టణాధ్యక్షులు వెంకటేశ్, నాయకులు నాగరాజు, రవీంద్రనాయుడు, భార్గవ్, బాలాజీ, ఎన్‌బికె రాజు, ప్రవీణ్, రవిచంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గ సభ్యులు

గోరంట్ల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ గోరంట్ల మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రామచంద్రప్ప, అధ్యక్షులుగా సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఓబులేసు, చంద్రశేఖర్, నంజప్ప, బాషా, ఉషారాణి, జిల్లా కౌన్సిలర్లుగా బాలకృష్ణ, ఆదినారాయణ, సిరాజుద్దీన్, సూర్యనారాయణ రెడ్డి, సుధాకర్, రవీంద్రారెడ్డి, సుజాత, కార్యదర్శులుగా ఈశ్వర్‌రెడ్డి, వెంకటేష్, సోమిరెడ్డి, తన్నూకుమార్, రామక్రిష్ణ, ప్రభావతి, ఆడిట్ కమిటీ కన్వీనర్ లక్ష్మీపతిరెడ్డి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర, ఉపాధ్యాయులు అశోక్, శోభన్‌బాబు వ్యవహరించారు.

గీతా పారాయణంలో చిన్నారుల ప్రతిభ



గీతాపారాయణం పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

హిందూపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన భగవద్గీత పారాయణ పోటీల్లో చిన్నారులు చక్కటి ప్రతిభ కనబరచారు. శిక్షణ పొందిన చిన్నారులు పాఠశాల, పట్టణ స్థాయి, జిల్లాస్థాయి పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయికి అర్హత సాధించినట్లు సంస్థ నిర్వాహకురాలు నాగవేణి తెలిపారు. తనిష్క, ధనైర, రుషినందన్, నిత్యవాహిని, అభినయ, లిఖిత్, థారుష్, జ్యోష్నిక తదితరులు ప్రతిభకనబరిచారు. వీరిని ఆదివారం అభినందించారు.

నేడు పరిష్కార వేదిక

గుడిబండ/రొళ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుడిబండ, రొళ్ల తహసీల్దార్లు శ్రీధర్, శెక్షావలి ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు కుంభాభిషేకం

హిందూపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దులోని దాల్వాటం లక్ష్మీనరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, కుంభాభిషేకం కార్యక్రమం మూడోరోజు సోమవారం జరుగనుంది. పురాతన చరిత్రకలిగిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి జీర్ణోద్ధరణ కార్యక్రమం జరిగింది. మూడురోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనివారిపల్లికి చెందిన 28 యేళ్ల వివాహిత రాజేశ్వరి విషద్రావకం తాగి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబకలహాలతో మనస్థాపానికి గురైన ఆమె విషద్రావకం తాగి అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ ఉషా చికిత్సలు చేసి మెరుగైన వైద్యంకోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

బాధ్యతల స్వీకరణ



మంజుల

గుడిబండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా మంజుల ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసే ప్రిన్సిపాల్ ప్రసాద్ గతనెల పదవీవిరమణ పొందారు. పేరూరులో విధులు నిర్వహిస్తున్న మంజుల ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆమె మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేస్తామన్నారు.